ప్రేమకోసం జీవించే ఆ ప్రేయసీ ప్రియుల అన్వేషణకి అంతం లేదా?

# నీకోసం నేను

ఎస్. పురుషోత్తమాచార్య కథ

జూబిలీ హిల్స్ ఫ్లాట్‌లోని వరండాలో కూర్చుని వున్న నాకు ఎదురుగా వర్షంలో కంటికేమీ కనిపించటం లేదు. వాతావరణం మామూలుగా వున్నపుడు నా కళ్లకి హరివిల్లులా కనిపించే అక్కడి ప్రకృతి దృశ్యాలు యిపుడా వర్షంలో అదృశ్యమయిపోయాయి. నా చేతిలోని సిగరెట్ పీకకాస్తా చురుక్కుమనేసరికి ఉలిక్కిపడ్డాను. అప్పటికే వానజల్లు తాకి నా దుస్తులన్నీ కూడా తడిసిపోయాయి. వరండాలో అంగుళం లోతున నిలిచిన నీటితో నా రెండు పాదాలు కూడా దోబూచులాడుతోన్నాయి.

ఈ రకం అనుభవం నాకు కొత్తది కాదు! గత ముప్పై ఏళ్లుగా ఈ వర్షపు వేళలు నన్నిలాంటి అవస్థకి గురిచేస్తూనే వున్నాయి. వర్షం పడుతూన్నపుడు పరధ్యానంతో నడిచే నా కాళ్లు వీధిలో నిలిచిన నీళ్ల అడుగున నేలలోని రాళ్లని తగిలి రక్తసిక్తాలవటం ఎన్నోసార్లు జరిగింది. అలాగే ఓసారి అన్యమనస్కంగా నడుస్తూన్న నాపై వీధిలోని ఓ చెట్టు విరుచుకుపడిపోతూండగా ఎవరో గభాలున ప్రక్కకు లాగటంతో బ్రతికిపోయి బట్ట కడుతున్నాను. మరోసారి వర్షంలో దీపాలు లేకుండా నాపైకి దూసుకొచ్చిన ఓ లారీని అతికష్టంగా తప్పుకుని ప్రాణాలు కాపాడుకున్నాను. ఇలా ఎన్నోసార్లు నాకు ప్రమాదాలు తటస్థిస్తూనే వున్నాయి. వర్షపు వేళల్లో నాలో కలిగే అవ్యక్తానందమూ, అపారమైన వ్యథా రెండు కూడా నన్ను నిశ్చేష్టుణ్ణి గావిస్తూనే వుంటాయి.....

..... సిగరెట్ పీకని వీధిలోకి విసిరేద్దామని లేచి నుంచున్నాను. అంతలోనే ఆకాశం



కాస్తా ఫెళ! ఫెళ! లాడింది. ఎక్కడో పిడుగు పడినట్లుగా పరిసరాలు దద్దరిల్లిపోయేయి. దాంతో నేనున్న పదో అంతస్థు ఫ్లాట్ కాస్తా అలా నేలకి జారిపోతూన్న అనుభూతి కలిగి భయంతో కళ్లుమూసుకున్నాను....

.... అలా కళ్లు మూసుకున్న నా కనురెప్పల టీ.వి. తెరమీద మళ్లీ నా చిన్ననాటి నేస్తం 'శాంత' రంగుల రూపం

అవతరించింది! ఆనాడు రంగురంగుల పూ లతోటల మధ్య మేమిద్దరమూ చెట్టాపట్టా లేసుకుని తిరుగాడిన మధుర క్షణాలు కాస్తా మళ్లీ నా కళ్లముందు కదలాడసాగేయి. ఆమధురానుభూతి నాకు పాలమీగడలో పం చదార కలిపి తిన్నపుడు గొంతులోజారే రుచి తరంగాలకన్నా మధురంగా తోచింది...

శాంత! ఎంత అందమైనపేరు?... పసు పు ముద్దని మలిచి సృష్టించబడిన అందాలరా శి శాంత!... ముద్ద మందారం లాంటి సుతిమెత్తని దేహంతో అదోరకం సువాసనని వెదజల్లే సుందర రూపసి శాంత!... నిండు గా పుష్టిగా తీర్చిదిద్దిన నవజీవన శిల్పం శాంత!

నా కపుడు పదిహేనేళ్లు! నేను నిజామా బాదులోని వైశ్యా హైస్కూల్లో చదివేవాణ్ణి! శాంత గరల్స్ హైస్కూల్లో చదివేది! స్కూళ్లు వేరయినా మెట్రిక్ దాకా ఒక్కో క్లాసుని దాటుతూ వచ్చాం! అందువల్ల మా యిద్దరి మధ్యా నోట్సు పుస్తకాలు మారుతూ వుండేవి.

కంఠేశ్వరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ లో మా రెండిళ్ల మధ్య ఓ అడ్డుగోడ వుండేది! ఆ గోడకిరువైలా నుండుని ఎవరూ లేనపుడు ఘంటసాల, సుశీలల యుగల గీతాల్లోని చరణాలని పాడుకుంటూ వుండేవాళ్లం! అలా ఒకటి రెండుసార్లు పెద్దల కళ్లలో పడి చివాట్లు తినవలసి వచ్చింది. దాంతో అవకాశం దొరికినపుడల్లా మా ఇళ్లకి దగ్గరగా వున్న ఓ పాడుబడిన బంగళా వెనుక తోటలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ వుండేవాళ్లం!

సీతాకోక చిలకల్లా అలా గమ్యం లేకుండా తిరిగిన మాకు ఆ రోజుల్లో వయస్సు పిలుపులు వినిపించలేదు. పసితనం అల్లరితో మేం చేసిన ఆగడాలూ, ఆడిన జగడాలూ ఈ నాటికీ మధుర స్మృతులుగా మిగిలిపో యాయి. మెట్రిక్ పరీక్షలు ముంచుకొచ్చిన తరుణంలో మా కలయికకి ఆటంకం ఏర్పడింది. ఆ కొద్ది ఎడబాటులోనే యౌవ్వ నం మా గుండెల తలుపుల్ని తట్టింది! పరీక్షలు కాగానే మా అనుబంధానికి పూర్తి గా అంతరాయం ఏర్పడింది. శాంతని వాళ్ల ఇంట్లో నుంచి కదలకుండా కట్టడి చేసేరు. నేను కూడా నిజామాబాదు వదలి వెళ్లవలసి వచ్చింది.

నేను వెళ్లిపోయే రోజున ఉదయం నుంచి వర్షం నిర్విరామంగా కురుస్తూ వచ్చింది! ఏదో విధంగా శాంతని కలుద్దామన్న నా ప్రయత్నం ఏదీ కూడా ఫలించలేదు. రైలు బయలుదేరే సమయం దగ్గరవుతున్నకొద్దీ శాంతను చూడాలన్న ఆరాటం కాస్తా నాలో అధికం కాసాగింది. కాని నిరాశతో రిక్షాలో బయలుదేరబోతున్న క్షణంలో తమ యింటి వెనకాలే మల్లెపొదచాటున వర్షంలో తడుస్తూ నా వంక చూసింది శాంత! ఆమె కళ్లు వర్షంతో పోటీపడి కన్నీటిని కురిపిస్తున్నాయి!

అదే నేను శాంతని చివరిసారిగా చూసిన చూపు!

తొలి వయస్సు పలకరింపుకు పులకరించి న మా మనసులు కాస్తా ఆ ఎడబాటుని భరించలేకపోయాయి. నా కోసం పరితపి స్తూ శాంత కన్నీటిని వరదలుగా ప్రవహింపజేసి

వుంటుంది! నాలో ఆవిడపై రగులుతున్న ప్రేమాగ్ని నన్ను దావానంలా దహించివేసింది!

ఆ తర్వాత శాంత నాకు కనిపించలేదు. ఆవిడ కోసం మళ్లీ నిజామాబాదుకు వెళ్లినా ఆమె ఆచూకీ మాత్రం తెలిసి రాలేదు. ఆమె అర్ధాంతర అంతర్ధానం ఆ క్షణం నుంచీ నన్ను అశాంతితో అణచివేస్తూనే వుంది......

.... ఇంతలో మళ్లీ వర్షం మొదలయింది. వానకుండ పోతలా కురుస్తోంది. పట్టపగలే అర్ధరాత్రిలా వాతావరణం అలుముకుని వుంది. నల్లగా దట్టంగా అలుముకున్న మేఘాల వెనుక నుంచి మెరుపులు మెరుస్తూ కళ్లని చెదరగొడుతున్నాయి. ఉరుములు భయంకరంగా గర్జిస్తున్నాయి. కనుచూపు మేరంతా కూడా వర్షం తెరలో మరుగున పడిపోయింది. పరిసరాల్లోని చెట్లన్నీ కూడా గాలి ఉధృతాన్ని తాళలేక శివతాండవం చేస్తోన్నాయి. హఠాత్తుగా ఎక్కడో పిడుగుపడినట్లుంది! ఆ ధ్వనికి పరిసరాలన్నీ కూడా కంపించేయి. భయంతో కళ్లు మూసుకున్నాను. ఆ మూసుకున్న కళ్లలో కూడా ఉజ్వలమైన కాంతిపుంజాలు!.... ఆ కాంతి వలయంలో కనురెప్పల తెరల మీద మళ్లీ శాంత రూపం అవతరించింది....

.... యిరవై ఏళ్లక్రితం నా క్లాసుమేట్లు సత్యవాణి, లక్ష్మీ మహాలక్ష్మి కవలలిద్దరూ కూడా తమతమ భర్తలతో కోటీ మార్కెట్లో హఠాత్తుగా తారసిల్లేరు. కబుర్ల మధ్యలో వారిద్వారా నాకు శాంత గురించి కొద్దిగా వర్తమానం తెలిసి వచ్చింది.

శాంత నా గురించి అనుక్షణం ఆలోచిస్తూ రోదిస్తూ చాలాకాలం వాళ్ల తల్లిదండ్రులతో నానా చివాట్లు తినేదట! నా గురించి ఆ ముగ్గురితోనూ చెప్పుకుని ఎన్నోసార్లు ఏడుస్తూ వుండేదట!

వాళ్లు చెప్పిన ఆ వార్త కాస్తా శాంత మనస్సులో నా స్థానాన్ని బలపరిచింది. వాళ్లు చెప్పింది విన్నాక నా మనస్సులో కోటి


## జీనియస్!



★ కోపెన్‌హాగన్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రాస్క్ 235 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలడు. అంతేగాక ఆయన వివిధ భాషలకు చెందిన 28 డిక్షనరీలను తయారు చేశాడు.

-బల్లా సుశీలా ప్రమీల

కోయిలలు పాటల్ని పాడేయి. నాలాగే శాంతలో కూడా ప్రేమ విపంచి సరాగాల్ని పలుకుతోందని తెలియగానే నా మనో వీణాతంత్రులు కూడా హాయిగా మ్రోగేయి. ఆమె హృదయంలో నాకు స్థానం వుందని తెలిసిన ఆ ఒక్క నిజం చాలు నాకు! ఆ సంతృప్తితో మరో జీవితకాలం జీవించగలను!

ఆ వార్త బలం తిరిగి నన్ను శాంతను అన్వేషించటానికి ప్రోత్సాహాన్నిచ్చింది.

మళ్ళీ నిజామాబాదువెళ్ళి వాకబు చేసాను. కాని శాంత గురించి ఏ ఆధారమూ దొరకలేదు. హైదరాబాదులోని వీధివీధీ, మార్కెట్లూ, సినిమా హాళ్లూ, కాలేజీలు అన్నీ కూడా విసుగు లేకుండా వెదికాను. అలా వెదుకుతున్నపుడు హఠాత్తుగా వాళ్ల స్వంత ఊరు కాకినాడని గుర్తుచేసుకున్నాను. దాంతో కాకినాడ వెళ్లి ఓ వారం రోజులు గాలించినా ఫలితం లేకపోవటంతో హైదరాబాదు తిరుగు ప్రయాణం కట్టవలసి వచ్చింది.

కాకినాడ నుంచి బయలుదేరినప్పుడు కూడా వర్షం పడుతోంది. రావులపాలెం దాకా కన్నూమిన్నూ కానరాకుండా పడుతోన్న ఆ వర్షంలో బోల్తా కొట్టిన వాహనాలెన్నో దోవలో కనిపించేయి. పంట పొలాలన్నీ కూడా వరద నీటిలో మునిగి తేలుతున్నాయి. గోదావరి నిండుగా ప్రవహిస్తోంది. ఆ ప్రకృతి బీభత్సానికి తల్లడిల్లిన మనస్సుతో తణుకు చేరిన బస్సులోంచి టాయిలెట్ కి వెళ్లేందుకు దిగిపోవలసి వచ్చింది.

నేను వచ్చిన బస్సు అలా ఆగిందో లేదో తణుకు నుంచి ఓ రెండు మూడు బస్సులు ఒకేసారిగా ఏకబిగిన బయలుదేరాయి. అలా కదులుతున్న ఓ బస్సు కిటికీలోకి సారించిన నా దృష్టికి ఓ అద్భుతం సాక్షాత్కరించింది.

ఆ బస్సు కిటికీ ప్రక్కనే కూర్చుని వుంది శాంత! నన్ను చూడగానే ఆవిడ గొంతు చించుకుంది! మా రెండు కళ్ళూ కలుసుకున్నాయి. రెండు నదుల కలయికలా మా చూపు, కనుమరుగవుతోన్న ఆ బస్సువెంట సాగింది. కిటికీలో నుంచి లేచి నుంచుని తలని బయటికి పెట్టిన ఆవిడ్ని వెనక్కి లాగారెవరో! ఆ వెనక్కి లాగిన వారిని విదిలించుకుంటున్న శాంత వేగాన్ని గమనించాను. ఆ క్షణంలో శాంత ఉపయోగించిన బలానికి ఆ బస్సు కిటికీ ఇనుపచువ్వలు వొంగిపోయివుంటాయి! ఆ తర్వాత ఆమె కార్చిన కన్నీటి వరదలో ఆవిడవెళ్లే బస్సు కాస్త మునిగిపోయి వుంటుంది! తీరా కనుమరుగు కానున్న ఆ బస్సులోని శాంత గొంతు కాస్త నన్ను చేరింది.

"నేను నీ కోసం!..." ఏదో చెప్పబోయింది శాంత. అంతలోనే బస్సు కాస్త మలుపు తిరిగిపోయింది.

"నేను నీ కోసం!"

"నేను నీ కోసం!"

"నేను నీ కోసం!"

శాంత గొంతు నా చెవుల్లో యింకా ప్రతిధ్వనిస్తూనే వుంది. ఆ పిలుపులోని ఆర్ద్రతకి నా హృదయం కాస్త కరిగిపోయింది, శాంత యింకేం చెప్పదలుచుకుందో నా కనవసరం! నేను నీ కోసం! అన్న ఆ

ఆం: రఘురామి

వాక్యంలోని అర్థం చాలు నాకు.

ఆమె వెళ్లింది ఏ ఊరు బస్సో? అప్పుడే కదిలివెళ్లిన మూడు బస్సుల్లో ఒకటి రాజమండ్రి, రెండోది హైదరాబాదు, మూడోది కాకినాడ! ఏ బస్సని తెలుసుకునేది?

అశాంతితో తలవి బద్దలు చేసుకుంటున్న నేను కాస్తా నేను వచ్చిన బస్సు కూడా వెళ్లిపోవడం గమనించలేకపోయాను. బస్సుతో బాటుగా వెళ్లిపోయిన నా సూటుకేసు కన్నా శాంత అంతర్ధానం బాధ నాలో అధికమయిపోయింది.

దాంతో తిరుగు బస్సులో మళ్లీ కాకినాడవెళ్లి ఓ మూడు రోజులు వీధివీధీ తిరిగాను. ఫలితం లభించక రాజమండ్రి వచ్చి మరో మూడు రోజులు గాలించాను. కాని శాంత కనిపించలేదు. యిహ చేసేది లేక విరిగిన మనస్సుతోనూ, కరిగిన ఆశతోనూ, పెరిగిన గెడ్డతోనూ తిరిగి హైదరాబాదు చేరుకున్నాను.

ఇరవై ఏళ్లుగా శాంత అన్వేషణలో గడిపిన నా మనస్తత్వం నా తల్లిదండ్రుల్ని ఎనలేని విచారానికి గురిచేస్తున్నదన్న సంగతిని నేను ఎరుగుదును.


"ఈ విశాల ప్రపంచంలో ఆ అమ్మాయిని ఎలా వెదికి పట్టుకుంటావురా? ఆ పిల్లకి పెళ్లి కాలేదని ఏమిటి నీ నమ్మకం? నాన్నగారి ప్రశ్న నన్ను వెర్రివాణ్ణి చేసేది.

"ఏనాళ్లీ బ్రహ్మచర్యం నాన్నా? ఒక్కగానొక్క కొడుకువి! పిల్లాపాపలతో చల్లగా వుండగా చూడాలనుందిరా!" అమ్మ ఆనాటి నుంచి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

కాని శాంత కనిపిస్తుందన్న నమ్మకం యింకా నాలో చావలేదు. మనస్సు నిండా యింకా ఆశని నింపుకుని బ్రతుకుతున్న నన్నూ నా పెళ్లినీ చూడలేక నాన్నగారు ఈ లోకాన్ని వదిలేరు. నాన్నగారు పోయాక అమ్మమాత్రం జీవచ్ఛవంలా బ్రతికే వుంది.

ఊళ్లోని పొలం పుట్రా అమ్మేసి ఆ డబ్బుతో జూబిలీ హిల్స్‌లో ఫ్లాట్‌ని కొన్నాను. ఆయిల్ ఇండియా కంపెనీలో ఉద్యోగం నా మనుగడకి సహకరిస్తోంది. నాకు వండిపెడుతూ, నా దురదృష్టానికి చింతిస్తూ అమ్మ నా వెంటే వుంటోంది....

.... యింతలో ఆకాశం సద్దుమణిగింది.



వాతావరణంలో ప్రశాంతత అలుముకోసాగింది. అక్కడక్కడా నల్లని మబ్బుల వెనకాల సూర్యకాంతి తళుక్కుమంటం ప్రారంభించింది. నా ఫ్లాట్‌కి ఎదురుగా కనిపించే కొండల్లో నుంచి పలుచోట్ల వర్షపు నీరు జలపాతాలుగా జారిపోతోంది.

ఇంట్లో అమ్మ మధ్యాహ్నం కునుకు నుంచి మేలుకున్నట్లుంది. ద్వారంలో కొచ్చి నుంచుందామె. ఎండిన పండుటాకులా కొమ్మనుంచి రాలటానికి సిద్ధంగా వున్నట్లుందామె. ఆమె బలహీనమైన ఆకారాన్ని చూడగానే నా కళ్లు చెమర్చాయి.

"ఏంటమ్మా?" ఆర్ద్రంగా ప్రశ్నించాను.

"ఆ నీళ్లలో తడుస్తూ కూచోకు! అలా కూచునిపోతే శాంత కనిపించదు! జ్వరం వస్తుంది!" గిర్రున తిరిగి వెళ్లిపోతున్న అమ్మవంక చూస్తూ వుండిపోయాను.

అమ్మ మాటల్లోని చురుకుదనం నన్ను బాధించలేదు. నాకది అలవాటయిపోయింది. పెళ్లీ పెటాకులూ లేకుండా ఒంటరితనంతో ముదిరిపోతున్న నా వయస్సుని చూడలేని బాధ, యిలాంటి వర్షపు రోజుల్లో నేను శాంత గురించి ఆలోచిస్తూ మనస్సుని పాడుచేసుకుంటానన్న ఆవేదనా ఆమెనలా పరుషంగా మాట్లాడనిస్తాయి....

...... కాని ఓ ఐదేళ్ల క్రితం సోమాజీగూడాలో యాధృచ్ఛికంగా కనిపించింది లీల! తన భర్తతో కలిసి లాల్‌బంగ్లా ప్రాంతంలో కనిపించేసరికి ఆశ్చర్యంలో తలమునకలయ్యాను. లీల కూడా నిజామాబాదులో మా ప్రక్కింటి వాటాలో వుండేది! లీల తండ్రి అప్పారావుగారికీ మా నాన్నగారికీ వ్యాపారపరంగా చాలా దగ్గరి సంబంధాలుండేవి. అపుడు నాకు పన్నెండేళ్లు! లీలకి పద్దెనిమిదేళ్లుండేవుంటాయి. నాకు చదువు చెబుతుండేదామె. రమా నేను కూడా వెళ్లి మా ఇంటి దగ్గరి వాటర్‌టాంక్ స్థంభాల మధ్యలో కూచుని కబుర్లు చెప్పుకునేవాళ్లం! పాతికేళ్ల తర్వాత కనిపించిన లీలని నేను సులభంగా గుర్తించగలిగాను. ఏభై ఏళ్లు వచ్చుంటాయామెకి. కాని ఆమె మొహంలో మాత్రం ఏ మార్పూ లేదు. భర్తా పిల్లలతో కలిసి వెడుతోన్న లీలని వెళ్లి పలకరించాలనుకున్న నాకు మొహమాటం... పిరికితనం... అడ్డొచ్చేయి. కాని లీల నాకు తటస్థపడటం ఓ రకంగా నాలోని ఆశకి జీవం పోసింది. పాతికేళ్ల తర్వాత లీల కనిపించగలిగినపుడు శాంత మాత్రం ఎందుకు కనిపించకూడదు?

చివరకు అదే నిజమయింది!

మూడేళ్ల క్రితం ఆఫీసు పనిపై అస్సాంలోని బొంగైగావ్‌కి వెడుతున్నాను. కలకత్తా నుంచి బయలుదేరిన డార్జిలింగ్ మెయిల్లో ప్రయాణిస్తున్నాను. ఫరక్కా బ్యారేజిపై నుంచి రైలు జర్రిపోతులా జారిపోతోంది. క్రింద కనుచూపు మేరంతా కూడా గంగానది విస్తరించి వుంది. మొదటిసారిగా బ్యారేజీపై నుంచి రైల్లో వెడుతున్నాను. అంత క్రితం బ్యారేజీ కట్టక ముందు గంగానది వొడ్డున ఖజూరాహ ఘాట్‌లో రైలు దిగి కాలినడకన రేవుకి చేరి అక్కడి నుంచి స్టీమర్లో అవతలి గట్టుకి చేరేవాళ్లం! మళ్లీ అక్కడ మా రైలు ప్రయాణం మళ్లీ ఆరంభమయ్యేది. ఆ భయంకర ప్రయాణ అనుభవం గుర్తుకొచ్చి నా వొళ్లు కాస్త జలదరించింది.

రైలు ఫరక్కా దాటి మాల్దా చేరుకునే సమయంలో మళ్లీ నా దురదృష్టం కొద్దీ వర్షం మొదలయింది. ఆకాశానికి ఎక్కిన సముద్రం నేలకు దూకుతున్నట్లుగా ఆ పరిసరాలన్నీ కూడా జలమయమయిపోయేయి.

రైలు ఆగిపోయింది. అరగంట గడిచినా కూడా రైలు కదలకపోయే సరికి జనం విసుక్కోసాగేరు. కారణం తెలుసుకునేందుకు వర్షం అవకాశం యివ్వలేదు. మరో అరగంట తర్వాత చావు కబురు ఎలాగయితేనేమి చల్లగా చేరింది. మా రైలుకు ముందు అదే లైనులో వెళ్లిన ఓ గూడ్సు బండిని మరో గూడ్సు బండి ఎదురుగా వచ్చి ఢీకొందట! వర్షం కలిగించిన తికమక వ్యవహారంలో అక్కడి సిగ్నల్ కాబిన్ సిబ్బంది ఏదో పొరపాటు చేసి వుంటారు.


దాంతో ఎటూ తోచని క్లిష్ట పరిస్థితి ఏర్పడింది. ప్యాసింజెర్లంతా కంగారుతో సతమతమవుతుండగా మరో వార్త మమ్మల్ని చేరింది. ఆ వార్త తొలుత సంతోషాన్ని కలిగించినా మేం అనుభవించబోయే వ్యథని ఊహించి అందరి మొహాలు కూడా దిగాలుగా వాలిపోయాయి.

ఆక్సిడెంటు సైటుకి కొద్ది దూరంలో కలకత్తా వెళ్లే డార్జిలింగ్ మెయిల్ అక్కడి నుంచే వెనక్కి జల్పాయగురికి వెడుతుందిట! మేం వచ్చిన రైలు యిక్కడి నుంచే తిరిగి హౌరా వెళ్లిపోతుందిట! రెండు రైళ్లలోని జనం కూడా తమ తమ సామానులతో ఆక్సిడెంటు స్థలాన్ని దాటుకుని తాము వెళ్లవలసిన రైళ్లని చేరుకోవలసిందిగా రైల్వే వాళ్లు ప్రకటించారు. దాంతో జనంలో కంగారు బయలుదేరింది. అవతలివైపు డార్జిలింగ్ మెయిల్లో మాల్డా నుంచి వచ్చిన ఓ కూలీల గుంపు మా రైలు వంక పరుగెత్తుకుని వచ్చి చుట్టుముట్టింది.

అరగంటకోసారి సామాన్లని అటూ ఇటూ చేరవేస్తున్న కూలీలు కాస్తా బాగా డబ్బు చేసుకోసాగేరు. ఆ కూలీల వేగాన్ని ప్యాసింజర్లు అందుకోలేకపోతున్నారు. ఆ వర్షంలో, బురదనేలలో, రాళ్లూ రప్పలూ కాళ్లకి తగులుతుండగా జనం హడావిడిగా పరిగెత్తవలసి వచ్చింది.

విషయం తెలిసిన నేను తొందరపడదలచుకోలేదు. రద్దీ పూర్తిగా తగ్గాక ఓ కూలీని

## పరీక్ష



కొడుకుని కోపంగా అడిగాడు తండ్రి. "రవీ... నువ్వు పరీక్ష తప్పావట నిజమేనా"

"అమ్మ నెల తప్పిందంటే ముద్దిచ్చావు. నేను పరీక్ష తప్పానంటే కోప్పడుతున్నావేంటి..."

"...!!!..."

—వి.వి. జగన్నాధరావు,
విజయనగరం.

మాట్లాడుకుని మెల్లిగా బయలుదేరాను.

అప్పుడు వర్షం కురుస్తూనే వుంది. వర్షపు జల్లు విసురుతూన్న ఇసుకలా మొహానికి బలంగా తాకుతోంది. అడపాదడపా కళ్లకి తెరలు పడుతోన్నాయి. చుట్టూ జనం అరుపులూ, కూలీల కేకలతో వాతావరణం అంతా అల్లకల్లోలంగా వుంది. ఆ కన్ఫ్యూజన్ వాతావరణంలో కూలీ వెనకాల పరిగెడుతూన్న నా పైకి అదే స్థితిలో తూలిపడ్డారెవరో! నాపై తూలిపడిన వ్యక్తి స్త్రీ కావటంతో కళ్లు చించుకుని ఆవిడ వంక చూసాను. అపుడే ఆకాశం గర్జించింది. ఆ మెరుపుల కాంతిలో ఆమెని గమనించిన నా కళ్లలో సింద్రదీలు వెలిగేయి! తారాజువ్వలు రివ్వు క్కుమన్నాయి! వేయి వీణాతంత్రుల నాదం నా కర్ణపేటికల్లో ధ్వనించింది. నా మనస్సు పాలసముద్రంలోని నావలా తేలిపోయింది!

ఆమె శాంత!!!

నా వొడిలో వొదిగిపోయిన ఆమె నన్ను గుర్తించటానికి కొన్ని క్షణాలు పట్టాయి. నన్ను గుర్తించాక ప్రపంచాన్ని జయించిన దానిలా ఆనందంతో నా గుండెల్లో గువ్వలా యిమిడిపోయింది.

"నేను నీ కోసం!..." ఏదో చెప్పబోయింది శాంత.

"సార్!" మా వాలకాన్ని అదోలా కనిపెడుతూన్న నా కూలీ గావుకేక వింటూనే శాంతని వదిలేసేను. అలా వదులుతూ నా చేతిలో నుంచి స్వర్గం జారిపోతున్న అనుభూతిలో ఆమె వంక చూసాను.

నాలుగు పదులు దాటిన శాంత శరీరం నిండుగా కనిపిస్తోంది. నడుముపైన పడిన ముడతలు వయస్సుని తెలుపుతున్నాయి. కాని ఆమె మొహంలో మాత్రం అణుమాత్రం మార్పు లేదు. ఆమె మెడ బోసిగా వుంది. తాళిబొట్టు ఛాయలు కనిపించలేదు. మొహాన కుంకుమ బొట్టు అతుక్కునే వుంది.

"నీ కోసం నేను ముప్ఫయేళ్ల నుంచి గాలిస్తున్నాను"! శాంత గొంతులో జీర ధ్వనించింది.

నీ కోసం నేను!

నీ కోసం నేను!

"నీ కోసం నేనూ నా జీవితాన్ని అట్టేపెట్టాను శాంతా!" అరిచాను నేను.

అది వింటూనే మళ్లీ నా గుండెల్లో తలదాచుకుంది శాంత.

"నీవు కనిపిస్తావన్న ఆశతో జీవిస్తున్నాను!" అందామె.

"నీ కోసం అందరి ఆశల్నీ వమ్ము చేస్తూ వచ్చాను!" అన్నాను నేను.

"సార్!"

"అమ్మా!"

మా యిద్దరి కూలీల కేకలూ మమ్మల్ని మళ్లీ విడదీసేయి. వాళ్ల నెత్తిమీదవున్న బరువులతో మా వంక విచిత్రంగానూ, కోపంగానూ చూస్తున్నారా యిద్దరూ. అయి నా వాళ్లని పట్టించుకోకుండా ఆ వర్షంలో... ఆ బురద నేలలో నుంచుని మేం తనివి తీరని మనస్సులతో మాట్లాడుకుంటూనే వున్నాం.

చివరకి ఆ కూలీలు విసిగిపోయేరు.

"సార్! మీ సామాన్లనిక్కడ పడవేసి మేం వెళ్లిపోతున్నాం! అవతల రైలు

బయలు దేరటానికి సిద్ధంగా వుంది!'' ఇద్దరూ కూడబలుక్కున్నట్లుగా జతగా పలికేరు.

అది వింటూనే శాంతా నేను కూడా ఉలిక్కిపడ్డాం.

మా కెదురుగా ఆక్సిడెంట్ స్థలం భయంకరంగా కనిపిస్తోంది. ఢీకొన్న రెండు డీసెల్ యింజన్లూ ఒక దాన్ని ఒకటి పెనవేసుకున్నట్లు గాల్లో నిటారుగా లేచి నుంచుని వున్నాయి.

వర్షం పడుతూనే వుంది.

ఆ భయంకర వాతావరణంలో శాంతా నేనూ మరొకసారి గాఢాలింగనం చేసుకుని విడిపోయాం.

''నన్ను వెంటనే కలుసుకో పురూష్!'' శాంత గొంతు దీనంగా పలికింది.

''నా పని పూర్తికాగానే నీ కోసం రెక్కలు కట్టుకుని వాలుతాను!'' అన్నాను నేను.

సంతృప్తి నిండిన గుండెలతో అవతలి రైల్లోని నా బెర్త్‌లో తాపీగా నడుం వాల్చాను. శాంత రూపం నా కళ్లముందు కదులుతూండగా అంతవరకూ మేం మాట్లాడుకున్న మాటల్ని మననం చేసుకోసాగేను. చిన్ననాటి విషయాల్నీ, తనకు నాపై గల ప్రేమ ప్రభావాన్నీ వర్ణించిన శాంత మృదుల స్వరం యింకా నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే వుంది.

ఆ సుషుప్తావస్థలో వున్న నేను కాస్తా హఠాత్తుగా ఉలిక్కిపడుతూ లేచి కూర్చున్నాను. ఏదో అగాధంలోకి విరుచుకు పడిపోయినట్లుగా అయిపోయింది నా పరిస్థితి! నా కళ్లముందు గాఢాంధకారం ఒక్కసారిగా అలుముకున్నట్లయింది!

శాంత అడ్రసుని తీసుకోవటం మరిచిపోయాను నేను! అలాగే నా చిరునామాని కూడా ఆవిడ అడగటం మరిచిపోయింది!

దిగ్గునలేచి బండి దిగబోయాను. కాని నా రైలు అప్పటికే వేగాన్ని పుంజుకోవటంతో వెనక్కి అడుగువేయవలసి వచ్చింది. అదే సమయంలో అవతలివైపు నా శాంతని తీసికెడుతూన్న రైలు కేక కాస్తా నా కర్ణపుటాలకి కర్ణకఠోరంగా సోకింది.

రెండు కాళ్లకీ పక్షవాతం వచ్చినవాడిలా దిగాలుగా చతికిలబడిపోయాను.

''మళ్లీ అన్వేషణ! ఈ అన్వేషణకి ఇక అంతం లేదా? ఘోషించింది నా మనస్సు. మూడేళ్ల క్రితం ఆంధ్రదేశం వదలి బెంగాల్లో తారసిల్లిన శాంతని ఈ దేశవ్యాప్తంగా ఎక్కడని వెదకను? కాని ఆశ మాత్రం చావలేదు! శాంత తిరిగి కనిపిస్తుందన్న ఆశతో బ్రతుకుని సాగదీస్తూనే వున్నాను.

ఈ వర్షపు సమయాలందుకే నాకు ప్రీతికరం గా తయారయ్యాయి. ప్రతిసారీ వర్షంలోనే శాంత నాకు తటస్థపడింది! ఈ వర్షపు రాత్రుల్లోనే శాంత రూపం నా కళ్లలో సాక్షాత్కరిస్తుంది! ఆమె రూపాన్నలా నా హృదయం మధ్యలో ప్రతిష్ఠించుకుని జీవిస్తూన్న నా అన్వేషణ యింకా సాగుతూనే వుంది.... ..... శాంతా!'

కళ్లు మూసుకుని అస్పష్టంగా కలవరిస్తూన్న నన్నెవరో తాకినట్లయింది.. మెల్లిగా కళ్లు తెరిచేను.

తన కళ్లనిండా నీళ్లతో నుంచుని వున్న అమ్మ బుజ్జగిస్తూ కాస్త మెల్లిగా నా తలని నిమురుతోం